క్లుప్తంగా

ఆదివారమూ తెరవనున్న విద్యుత్ బిల్లు కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆదివారం సెలవు దినమైనప్పటికీ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లులు వసూలు కౌంటర్లు పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్మూర్తి పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయాలతో పాటు సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

కడియం: మాధవరాయుడుపాలెంలో భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వ దేవతలకు హోమాలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ పారిశ్రామిక వేత్త చలమలశెట్టి సునీల్ పాల్గొన్నారు. ఆయన వెంట ఎస్ఆర్ఐ సీహెచ్ వేంకటేశ్వరరావు తదితరుల ఉన్నారు. వారికి గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ విజయ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేదాశీర్వచనం అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

31లోగా రెన్యువల్ చేయించుకోండి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రైవేటు నర్సింగ్ హోమ్స్, ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ క్లినిక్స్ వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా **www.cinicaesrtact.ap.gov.in** వెబ్‌సైట్‌లో రెన్యువల్ నమోదు చేసుకోవాలన్నారు. గడువు ముగిసిన అనంతరం ఈ పోర్టల్‌లో నమోదు అవదన్నారు. ఈ పోర్టల్‌లో నమోదు చేయని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల యాజమాన్యం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

28 నుంచి బైబిలు మిషన్ మహాసభలు

సీటీఆర్ఐ: ఈనెల 28, 29, 30 తేదీల్లో బైబిలు మిషన్ మహాసభలు నిర్వహిస్తున్నట్టు మిషను కార్యదర్శి రెవరెండ్ కె.ప్రశాంతకుమార్, సంయుక్త కార్యదర్శి జె.ఆగమనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైబిలు మిషన్ గుంటూరు కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఈ సభలు జరుగుతున్నాయన్నారు. జేఎన్ రోడ్డులోని ఎస్వీ ఫంక్షన్ హాలులో జరిగే ఈ మహాసభల్లో గుంటూరు నుంచి బైబిలు మిషను అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జె.శామ్యేల్ కిరణ్ ముఖ్య ప్రసంగీకులుగా హాజరవుతారన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రకాశం నగర్: రాష్ట్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులో స్వర్ణాంధ్ర కుట్టు శిక్షణ కేంద్రం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు నిర్వాహకులు గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్తీర్ణులైన ఐదుగురు విద్యార్థులను రాంబాబు అభినందించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటివరకూ 13 వేల మంది శిక్షణ పొందగా సుమారు 300 మంది రాష్ట్ర సాంకేతిక శాఖ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఏటా లోయరు, హయ్యరు పరీక్షలతో పాటు టెక్నికల్ టీచర్ కోర్సులో కూడా స్వర్ణాంధ్ర విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ నుంచి టెక్నికల్ టీచర్ శిక్షణ పొందిన వారు 38 మంది వివిధ ప్రభుత్వ పాఠశాలలలో క్రాఫ్ట్ టీచర్లుగా పని చేస్తున్నారన్నారు.

ఇంగ్లాండ్‌లో వికసించిన హరితాడోజు చిత్రాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు హరి తాడోజు కుంచె నుంచి జాలు వారిన చిత్రాలు ఇంగ్లాండ్ బర్మింగ్ హామ్‌లో ప్రవాస భారతీయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉగాది ఉత్సవ్ పేరిట ఇంగ్లాండ్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాజమహేంద్రవరం నగరానికి చెందిన స్ట్రోకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు, సంస్థ భాగస్వామి శ్రీవల్లి తిరుమల అత్యద్భుతమైన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు విచ్చేసిన ఇంగ్లాండ్‌లోని ప్రవాస భారతీయులందరినీ హరి తాడోజు చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ తీర్మానంపై హర్షం

ప్రకాశం నగర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం తీర్మానం చేసి, కేంద్రానికి పంపించడంపై తూర్పు గోదావరి జిల్లా ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ అధ్యక్షుడు జాలా నటరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపాల్ కాలనీలో జిల్లా ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ గత 26ఏళ్లుగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తున్నారన్నారు. వారికి ఎస్సీ హోదా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం మంచి పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి క్రైస్తవ సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుడాల జాన్సన్, కార్యదర్శి తాతపూడి మార్టిన్ సుధాకర్ , సంయుక్త కార్యదర్శి వై.ప్రభాకర్, కోశాధికారి కొమ్ము జాన్ క్రిస్టోఫర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివేళలా.. అనుకూలంగా..

- నగరంలో విస్తరిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు
- అందుబాటులో అన్ని రకాల వస్తువులు, తినుబండారాలు


ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న బ్యాగ్‌లు, షూస్‌లు

ప్రకాశంనగర్: జిల్లా రాజధాని రాజమహేంద్రవరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌తోపాటు చిరు వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. ప్రధాన సెంటర్లలో ఫుట్‌పాత్‌పై అన్ని రకాల వస్తువులు విక్రయిస్తున్నారు. ధరలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. కూరగాయలు, పండ్లు, తిను బండారాలు, దుస్తులు, ఆట బొమ్మలు, షూలు, చెప్పులు బ్యాగ్‌లు, వాచీలు, గాజులు, ఇంట్లో వాడుకునే ప్లాస్టిక్, స్టీల్ సామానులు వంటి అన్ని రకాల వస్తువులను చిరు వ్యాపారులు విక్రయిస్తున్నారు. నగరంలోని మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, సెంట్రల్ జైల్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు వంటి ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు నగరానికి వలస వచ్చి ఫుట్‌పాత్‌పై బొమ్మలు, ఇతర కళా ఖండాలను తయారు చేసి అమ్ముతున్నారు. ఇప్పటికే నగరంలో ప్రధాన వాణిజ్య సముదాయులుగా పిలవబడే కోటగుమ్మం సెంటర్, సీతమ్మ సందు వంటి ప్రాంతాలు నగరంలో ప్రధాన మార్కెట్లుగా ఉన్నాయి. వీటితో పాటు హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లైన మహాత్మా గాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్‌లకు నగరవాసులతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి జనం ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

స్ట్రీట్ ఫుడ్ హబ్‌గా అర్బన్ ఫుడ్ ప్లాజా

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్ ప్లాజా స్ట్రీట్ ఫుడ్ హబ్‌గా మారింది. సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున యువతి, యువకులు, చిన్నారులు ఇక్కడకు చేరుకోవడంతో ఈ ప్రాంతం సందడిగా మారుతోంది. అర్బన్ ఫుడ్ ప్లాజాలో నగరవాసులకు నోరూరించే వెజ్, నాన్‌వెజ్ బిర్యానీలు, న్యూడిల్స్, ఫ్రైడ్‌రైస్, మంచూరియా, పావుబాజీ, పానీపూరీ వంటీ అన్ని రకాల తినుబండరాలను విక్రయిస్తున్నారు. వీటితో పాటు కంబాల చెరువు సెంటర్‌తో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లో సాయంత్రం వేళ్లలో ఏర్పాటు చేసే మొబైల్ క్యాంటీన్లకు జనం ఎగబడుతున్నారు. ధరలు తక్కువగా ఉండడంతో పాటు నాణ్యత కూడా బాగానే ఉండండతో నగర వాసులు స్ట్రీట్ ఫుడ్‌పై ఆసక్తి చూపుతున్నారు.

అండగా ప్రభుత్వం

చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలిచే కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆసరా, చేయూత, తోడు వంటి పథకాల ద్వారా మహిళలకు, చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిచడంతో పాటు వారికి వ్యాపారాలకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తోంది.

అందుబాటులో ధరలు



చిరు వ్యాపారులు అమ్మే వస్తువుల ధరలు అందుబాటులో ఉండడంతోపాటు నాణ్యత కూడా ఉంటోంది. వీటి ద్వారా షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్‌లో టాక్స్‌లతోపాటు డోర్ డెలివరి చార్జీలు వంటివిభారం ఉంటుంది. ఇక్కడ ఐతే కచ్చితమైన ధరతో పాటు మనకు నచ్చిన వస్తువు ఎంచుకోనే సౌకర్యం ఉంటుంది.

– ఆసీఫ్ భాషా

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి


పనులను పరిశీలిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, వైస్ చైర్మన్, నగర కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అధికారులను సూచించారు. రుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం బెంగళూరు నుంచి వచ్చిన ప్లాంతర్ పాట్స్ నమూనాలను వైస్ చైర్మన్, నగర కమిషనర్ దినేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ నగరంలో మొత్తం 500 పాట్స్ ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు తెలిపారు. వాటిని వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ జి.పాండురంగరావు, రుడా ఇ.ఇ.టి.చంద్రశేఖర్, రుడా ఎ.ఇ.దుర్గ ప్రసాద్, కాంట్రాక్టర్ గోపాల కృష్ణ, రుడా ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కార్మిక కుటుంబాలకు న్యాయం చేస్తాం


సమస్యలు వింటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: విజ్జేశ్వరం ఏపీజీపీసీఎల్ రెగ్యులర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హామీ ఇచ్చారు. శనివారం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజాను విజ్జేశ్వరం ఏపీజీపీసీఎల్ రెగ్యులర్ ఉద్యోగులు కలిసి తమ సమస్యలను విన్నవించి, ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు అందాల్సిన బెనిఫిట్లు అన్నీ అందించేలా తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. 76 మంది పర్మినెంట్ ఉద్యోగులు పని చేస్తున్నారని ఫ్యాక్టరీ లే ఆఫ్ ప్రకటించిన తర్వాత లే ఆఫ్ 1947 కార్మిక చట్ట ప్రకారం ఉద్యోగులకు సగం జీతం చెల్లించాల్సి ఉండగా, 20 శాతం మాత్రమే చెల్లిస్తుందని, ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వడంలేదని ఉద్యోగులు వాపోయారు. తమతో ఎటువంటి చర్చలు జరపకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని, దీనివల్ల 76 కుటుంబాలు రోడ్డుమీద పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే రాజా స్పందిస్తూ విజ్జేశ్వరం ఏపీజీపీసీఎల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, లేబర్ కమిషనర్ వారి దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విజ్జేశ్వరం ఏపీజీపీసీఎల్ ఉద్యోగుల తరుపున వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సూర్యనారాయణ జనరల్ సెక్రెటరీ ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- కోఆర్డినేటర్ చందనతో కలిసి ఆసరా చెక్కుల పంపిణీ


ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎంపీ మార్గాని, కో ఆర్డినేటర్ చందన తదితరులు

కడియం: మహిళల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. జేగురుపాడులో మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటీఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి ఎంపీ మార్గాని భరత్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు 25 వేల కోట్ల రుణాలను నాలుగు దఫాలుగా మాఫీ చేస్తున్నారన్నారు. మహిళాభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పాలనను అందిస్తున్న జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని, అందరి దీవెనలను అందివ్వాలని కోరారు. జగన్ వల్లనే ధరలు పెరిగాయని చెబుతున్న టీడీపీ నాయకులకు అన్ని రాష్ట్రాల్లోనూ అవే ధరలు ఉన్నాయని తెలియజేయాలని ఎంపీ మార్గాని పిలుపునిచ్చారు. రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని విధాలా ప్రాధాన్యతనిచ్చి, ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మహిళలు అండగా నిలవాలన్నారు. అనంతరం రాష్ట్ర సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ వీరన్న మాట్లాడారు. అనంతరం ఎంపీ మార్గాని, రూరల్ కోఆర్డినేటర్ చందనల చేతుల మీదుగా మండలంలోని 1354 గ్రూపులకు సంబంధించి రూ.11.04 కోట్ల చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కడియం మండల పార్టీ అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపీటీసీ ఆకుల సుధాకర్,మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, గుత్తుల వాసు, ఆరేటి వెంకట్రావు, ఎంపీడీవో కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డీఐ బి.దిలీప్‌కుమార్


విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న హుకుంపేట పాఠశాల హెచ్‌ఎం


గుబ్బల హర్షవర్ధన స్వామి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం అర్బన్‌లో నేషనల్ మీన్స్ కమ్యూనిటీ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 45 మంది అర్హత సాధించారని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ శనివారం తెలిపారు. స్థానిక విద్యానగర్‌లో నున్న నాగరాజా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల నుంచి తొమ్మిది మంది, లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి ఏడుగురు, సిటీ మున్సిపల్ హై స్కూల్ నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. గాంధీపురం మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ నుంచి ఆరుగురు, శ్రీకంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ నుంచి ఐదుగురు, ఆనంద నగర్ మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి ఇద్దరు, శ్రీనివాస రామానుజన్ హై స్కూల్ నుంచి ఇద్దరు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, క్వారీపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, నన్నయ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు నుంచి ఒకరు చొప్పిన ఎంపికయ్యారు.

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకంలో భాగంగా నిర్వహించిన అర్హత పరీక్షలో హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు సాయిసుధీర్, సాయిమణికంఠ, మౌనిషా, జ్యోత్స్న స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదివే వరకూ నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు ప్రతివిద్యార్థి జాయింట్ ఖాతాకు జమ అవుతాయన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఎంపికైన విద్యార్థులను, పరీక్షలో అర్హత సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు జి.జ్యోతి, పి.ఫణికుమార్‌లను ప్రధానోపాధ్యాయులు ఎంవీఎల్‌వీ ప్రసాద్ అభినందించారు.

ధవళేశ్వరం విద్యార్థి ప్రతిభ

ధవళేశ్వరం: ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ధవళేశ్వరం బాయ్స్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి గుబ్బల హర్షవర్ధన స్వామి ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. హర్షవర్ధన స్వామిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్, సభ్యులు అభినందించారు.

సంక్షేమ పథకాల అమలు ఘనత జగన్‌దే

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరు గ్రామ సచివాలయం–2 పరిధిలో గడపగడపకూ


బొమ్మూరు మురళీకొండపై కరపత్రాలను పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలు అమలు ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పేర్కొన్నారు. శనివారం బొమ్మూరు గ్రామ సచివాలయం–2 పరిధిలో మురళీకొండ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మూడోరోజు నిర్వహించారు. చందన, పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి 400 కుటుంబాల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ నుంచి పొందిన లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ అందజేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై పలువురు చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని అన్నారు. రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కార్యక్రమం ద్వార ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పథకాలను అమలు చేస్తూ మన రాష్ట్రం దేశంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు మత్స్యేటి శివ, సోమన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, మాజీ ఉపసర్పంచ్ దాకేశ్రీనివాస్, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాహుల్, జాలా మోషే, లారీ శ్రీను, ఇతర సచివాలయం కన్వీనర్లు గృహసారథులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువత సేవాభావంతో మెలగాలి

- వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్
- తొర్రేడులో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న డీన్ శ్యాంరాజ్ నాయక్

రాజమహేంద్రవరం రూరల్: యువత విద్యతోపాటు సేవాగుణం అలవాటు చేసుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్ అన్నారు. శనివారం తొర్రేడు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా శిబిరంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వ్యవసాయ కళాశాల డీన్ సీహెచ్ శ్యాంరాజ్‌నాయక్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రాధాన్యాన్ని వివరించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తపల్లి కేశవరామారావు, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శాంతరాజు, డీసీసీబీ సూపర్‌వైజర్ గాజింగం అప్పారావు, తొర్రేడు సొసైటీ సీఈవో కేవీవీ సత్యనారాయణ, తొర్రేడు సొసైటీ సభ్యులు దండమూడి అర్జునరావు, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ సాయిగంగాధర్, డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హైమజ్యోతి ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలు ఈనెల 31వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హైమజ్యోతి తెలిపారు.

మండలాలకు చేరిన పది ప్రశ్నపత్రాలు

కడియం: ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశ్నాపత్రాలు ఆయా మండలాల్లోని పోలీస్ స్టేషన్లకు చేరాయని ఎంఈవో వి.లజపతిరాయ్ తెలిపారు. అందులో భాగంగా కడియం పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలను శనివారం పరిశీలించి, సీల్ చేశారన్నారు.

రామకృష్ణకు 'ఆకుల' పరామర్శ

కడియం: డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు శనివారం స్థానిక వంగపండు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల రామకృష్ణ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి కుమారులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆయన వెంట కురుమళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నల్సా పరిహారంపై న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోక్సో చట్టం 2012, ఆంధ్రప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్ 2015, లైంగిక దాడులు, ఇతర నేరాలలో బాధితులైన మహిళలకు అందించే నల్సా పరిహార పథకం 2018పై జిల్లా న్యాయ సేవా సాధికారికత సంస్థ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్ ఆధ్వర్యంలో వివిధ నేరాలలో గాయపడిన బాధితులకు, మరణించిన వ్యక్తిపై ఆధారపడి జీవించే కుటుంబ సభ్యులకు పరిహారం అందించే స్కీములపై అవగాహన కల్పించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి సీహెచ్ రాజగోపాల్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సైన్స్ సెంటర్ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సబ్ రీజనల్ సైన్స్ సెంటర్‌ను త్వరలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బొమ్మూరులో నిర్మిస్తున్న సబ్‌రీజనల్ సైన్స్ సెంటర్‌ను శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. సైన్స్ సెంటర్‌లో వివిధ విభాగాలను సోమువీర్రాజు పరిశీలించి పలు విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్, పార్టీ మండల అధ్యక్షుడు యనాపు ఏసు, జిల్లా కార్యదర్శి తనుబుద్ధి భాస్కర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పడాల హరీరాం, యువ మోర్చా ఉపాధ్యక్షుడు మాల్లాడి వర ప్రసాద్, ఓబీసీ మోర్చా రూరల్ మండల అధ్యక్షుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ నిబంధనల్లో లోపాలు సవరించాలి

కంబాలచెరువు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మున్సిపల్ సబ్ కమిటీ సమావేశం ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ కన్వీనర్ జేవీవీ.సుబ్బారావు మాట్లాడుతూ పురపాలక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాల విద్యాశాఖకు అప్పగించడంతో ఈ సర్వీసు నిబంధనలను రూపొందించిందన్నారు. ఈ నిబంధనలను పురపాలక ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనివల్ల సర్వీసు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్.రవిబాబు మాట్లాడుతూ జిల్లా యూనిట్ నిబంధనల అమలు కంటే ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, అర్బన్ ఎంఈవో, డీవైఈవో క్యాడర్లు సర్వీస్ రూల్స్‌లో పొందుపరచాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేసి మరింత పకడ్బందీగా చేయాలన్నారు.

పన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: ఇంటి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు చెల్లించేందుకు ఆదివారం సెలవు దినమైనప్పటికీ నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌంటర్ యథావిధిగా పని చేస్తుందని కమిషనర్ దినేష్‌కుమార్ శనివారం ప్రకటించారు. నగరపాలక సంస్థ పరిధిలోనివార్డు సచివాలయాల్లో సొతం ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి చార్జీలు చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాట్లు చేశామన్నారు. బొగ్గల దిబ్బ సచివాలయం–42, కోటిపల్లి బస్టాండ్ ఈసేవా భవనం–36, సీతంపేట వాటర్ టాంకు వద్ద ఈసేవా భవనం–81, ప్రకాష్ నగర్ వద్ద ఈసేవా భవనం సచివాలయం–14, వీ.ఎల్.పురం కమ్యూనిటీ హాలు జలపుష్ప భవనం వద్ద ఉన్న సచివాలయం–23, నారాయణపురం వాంబే గృహాల వద్ద సచివాలయం–3లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ పోస్టర్‌ను శనివారం స్థానిక శ్యామల సెంటర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ సీనియర్ నాయకులు టీఎస్ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్ ఆవిష్కరించారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు అన్యాయం

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీపై వేటు వేయడం పార్లమెంట్ చరిత్రలో దురదృష్టకర సంఘటన అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పరిస్థితులు అగమ్యగోచరంగా ఉన్నాయన్నారు. రూ.12 వేల కోట్ల రుణమాఫీ అదానీకి చేశారని దానిని ప్రజలలోకి వెళ్లకుండా రాహుల్ గాంధీపై అత్యవసరంగా కేసులు వేసి, కోర్టులో తీర్పు వచ్చేలా చేసి పార్లమెంట్ నుంచి గెంటి వేశారని అన్నారు. రాహుల్ గాంధీపై కావాలనే అనర్హత వేటు వేశారని ధ్వజమెత్తారు. దీంతో అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని స్పష్టమైన సందేశం ఇచ్చారని అన్నారు.

నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటుకు నిరసనగా నగరంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి బోడా వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాంపేట గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన, ధర్నా చేశారు. కాంగ్రెస్ నాయకులు బెజవాడ రంగారావు, మారంపూడి వెంకటేశ్వరరావు,లీలావతి తదితరులు పాల్గొన్నారు.